క్లుప్తంగా

నేడు గణపవరంలో గ్రామోత్సవం

నాదెండ్ల: గణపవరం అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్పస్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, గురుస్వామి మండలనేని వెంకటేశ్వర్లు తెలిపారు. అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహంతో పాటూ గ్రామంలోని అన్ని ఆలయాలలోని ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సుమారు 400 మంది మహిళలు, మరో 400 మంది అయ్యప్పస్వాములు, గురుస్వాములు పాల్గొంటారన్నారు.

ఆలయ నిర్మాణ పనులు పరిశీలన



వినుకొండ(నూజెండ్ల): వినుకొండ కొండపై వెలసిన రామలింగేశ్వరసామి దేవస్థానం పునః నిర్మాణ పనులను స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిర్మాణ పనులు ఏ విధంగా జరుగుతున్నాయి తదితర అంశాలపై ఆలయ కమిటీని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ కొండపైన రూ. 50కోట్ల ఖర్చుతో 270 అడుగుల గాలి గోపురం నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. వినుకొండ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రం, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. రానున్న రోజుల్లో ప్రముఖ పుణ్యక్షేత్రాల మాదిరిగానే వినుకొండ పట్టణాన్ని తయారు చేస్తామన్నారు. ఆయనతో పాటు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



నరసరావుపేట: అనారోగ్యంతో బాధపడుతున్న పట్టణంలోని 25వ వార్డు పెద్దచెరువులోని టి.గిరిజకుమారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.10 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. మంగళవారం శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆర్థిక సహాయం చెక్కును ఆమెకు అందజేశారు.

నిబద్ధతతో పౌరసేవల్ని అధికారులు అందించాలి

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శీలం శ్రీనివాసులు రెడ్డి



చిలకలూరిపేటటౌన్: ప్రజాధనం వృధా కాకుండా పౌరసేవల్ని నాణ్యతా ప్రమాణాలతో ప్రజలకు అందించాలని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శీలం శ్రీనివాసులురెడ్డి చెప్పారు. మండలంలోని మురికిపూడి గ్రామ సచివాలయంలో 'సే నో టు కరప్షన్ -కమిట్ టు ద నేషన్' అంశంపై సెమినార్ మంగళవారం జరిగింది. అక్టోబరు 30 నుంచి నవంబర్ ఐదో తేదీ వరకు జరిగే వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఈ సెమినార్‌లో ఆయన మాట్లాడుతూ ఏపీ విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ డైరెక్టర్ జనరల్ పర్యవేక్షణలో గుంటూరు రీజనల్ శాఖ అధికారి కె.ఈశ్వరరావు ఆదేశాల మేరకు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌లోని వివిధ విభాగాల విధి-విధానాలపై అవగాహన కల్పించడమే విజిలెన్స్ అవగాహనా వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని వివరించారు. ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పనిచేయాలని కోరుతూ గ్రామస్థాయి ఉద్యోగులందరిచే సమగ్రతా ప్రతిజ్ఞను చేయించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ ఎస్ఐ కె.రామచంద్రయ్య, ఏవో కె.రమణకుమార్, పంచాయతీ కార్యదర్శి ఎస్ఎస్ బాపిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఎస్ఈబీ సిబ్బంది నూజెండ్ల మండల పరిధిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. ఈ దాడుల్లో నూజెండ్ల మండలం టి. అన్నవారం గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకొని అందులోని 4 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. ట్రాక్టర్‌ను, డ్రైవర్ పి. కోటేశ్వరరావును అదుపులోకి తీసుకొని ఐనవోలు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ దాడుల్లో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఆర్. విజయ భాస్కర్‌రావు, సబ్ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

వినుకొండ (నూజండ్ల): సివిల్ సప్లయ్ అధికారులు రైసు మిల్లుపై దాడి చేసి, 231 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. సివిల్ సప్లయ్ అధికారిణి పద్మశ్రీ తెలిపిన వివరాల మేరకు దాడిలో రేషన్ బియ్యంతో పాటు ప్రభుత్వ రేషన్ గోతాలను గుర్తించామన్నారు. సదరు వ్యక్తులపై కేసు నమోదుచేసామన్నారు. దాడిలో మాచర్ల, వినుకొండ సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.


అత్యుత్తమ వైద్య సేవలు

- వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు జాతీయ స్థాయి కాయకల్ప అవార్డు
- రాష్ట్రస్థాయిలో రెండుసార్లు అవార్డు



వైద్యసేవలు పొందుతున్న రోగులు

వినుకొండ(నూజెండ్ల): గతంలో ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలంటే సక్రమంగా వైద్యసేవలు అందుబాటులో లేక పేదలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత వినుకొండ ప్రభుత్వ వైద్యశాల రూపురేఖలు మారిపోయాయి. వైద్యానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా వినుకొండ వైద్యశాల ఒకసారి జాతీయ స్థాయిలో, రెండుసార్లు రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవలు అందిస్తూ అవార్డులు పొందింది. గతంలో ఆసుపత్రిలో మార్చురీ గది కూడా లేక మృత దేహాలను ఆసుపత్రి ఆవరణలో ఉంచే దుస్థితి నుంచి పార్కింగ్, మార్చురీ గది, తాగునీరు వంటి ఎన్నో సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆశయాలకు అనుగుణంగా పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు వైద్య సేవలందిస్తూ వినుకొండ కమ్యూనిటీ హెల్త్ సెంటరు రాష్ట్ర స్థాయిలో రెండుసార్లు, దేశవ్యాప్తంగా ఒకసారి అవార్డు అందుకుంది. నియోజకవర్గంలోని ఐదు మండలాల ప్రజలకు సేవలందిస్తూ అన్నీ రంగాలల్లో మంచి పేరు తెచ్చుకున్నందుకు ప్రజలు డాక్టర్ల సేవలకు అభినందనలు తెలియజేస్తున్నారు. దేశవ్యాప్తంగా పారిశుద్ధ్యం హాస్పటల్ మేనేజ్‌మెంట్‌లో అత్యుత్తమ నిర్వహణ చేస్తున్నందుకు గాను కాయకల్ప విభాగంగా దేశంలోనే ఉత్తమ సీహెచ్‌సీ వైద్యశాలగా గుర్తింపు పొందింది.



రాష్ట్ర ప్రభుత్వం మూడు నెలలకు ఒకసారి ర్యాంకుల ఆధారంగా అన్నీ విభాగాలల్లో వైద్య సేవలకు గాను ఇచ్చే హేయ్ హెల్త్ రిపోర్ట్ వారు ఇచ్చే అవార్డుకు ఏకంగా రెండు సార్లు ఎంపికైంది. ఓపీ, డెలివరీ, ఇన్‌పేషెంట్, ఇసీజీ, ఎక్స్‌రే, ల్యాబ్ పరీక్షలు వంటి విభాగాలల్లో టార్గెట్‌ను మించి వైద్య సేవలకు గాను అవార్డు అందుకుంది.



ఆసుపత్రిలో అందించే వైద్య సేవలు..

కమ్యూనిటీ హెల్త్ సెంటర్

గతంలో కాన్పులు కూడా ఆసుపత్రిలో జరిగే అవకాశం లేకపోవటంతో ఆసుపత్రి దీనస్థితికి చేరుకుంది. ప్రస్తుతం ఆసుపత్రిలో అన్నీ రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆసుపత్రిలో 10 మంది వైద్యులు అందుబాటులో ఉంటూ నిత్యం 400 మంది ఓపీ చూస్తున్నారు. గైనకాలజీ, జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్, ఎనస్థీయిషియా, సేవలతోపాటు, కంటి వైద్యం, పంటి వైద్యం క్రిటికల్ కేర్ విభాగంలో కూడా వినుకొండ వైద్యశాలలో అందుబాటులో ఉన్నాయి. గుండెకు సంబంధించి హార్ట్ ఎటాక్ వచ్చిన గంటలోపు రోగికి అందించే టెనెక్స్ ప్లస్ రూ.40 వేలు విలువ గల ఇంజెక్షన్‌లు వినుకొండ పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా నరసరావుపేట, సత్తెనపల్లి, చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రులతో పాటు వినుకొండ, గురజాల, అమరావతి, పెదకూరపాడు సీహెచ్‌సీల్లో అందుబాటులో ఉన్నాయి.

అందుబాటులో అత్యవసర చికిత్సా విభాగం

గతంలో ఎన్నడూ లేనివిధంగా అత్యవసర విభాగానికి సంబంధించి వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇటీవల రూ.2 కోట్లతో ఆసుపత్రి ఆవరణలో మంత్రి విడదల రజని చేతుల మీదుగా అత్యవసర చికిత్స విభాగాన్ని ప్రారంభించారు. ట్రామాకేర్ వైద్యసేవలు కూడా అందుబాటులోకి వచ్చాయి.

వైద్యసేవలు విస్తృతం చేస్తాం



వినుకొండ సీహెచ్‌సీ సెంటర్‌కు దేశంలో పారిశుద్ధ్యం ఆసుపత్రి మేనేజ్‌మెంట్‌కు సంబంధించి ఉత్తమ సీహెచ్‌సీగా అవార్డు పొందాం. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చే హేయ్ హెల్త్ రిపోర్ట్ వారు ఇచ్చే అవార్డుకు రెండుసార్లు ఎంపికైంది. ఆసుపత్రిలో అన్నిరకాల జబ్బులకు వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. రానున్న రోజుల్లో వినుకొండ ఏరియా ఆస్పత్రి హోదాలో వైద్యసేవలను మరింత విస్తృతం చేస్తాం.

డాక్టర్ అబ్దుల్ రజాక్, సూపరింటెండెంట్, వినుకొండ సీహెచ్‌సీ

నేడు పెన్షన్ల పంపిణీ

నాదెండ్ల: మండలంలోని పదహారు సచివాలయాల పరిధిలో వైఎస్సార్ పెన్షన్ కానుక-సామాజిక భద్రతా పెన్షన్లు బుధవారం ఉదయం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు.16 సచివాలయాల పరిధిలో వృద్ధాప్య, వితంతు, వికలాంగ పెన్షన్లు 9701 మందికి గాను రూ.2,67,47,500లు 5వ తేదీవరకూ వలంటీర్ల సాయంతో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు ద్వారా వలంటీర్లకు పెన్షన్ నగదు అందించారు.

పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

నరసరావుపేట రూరల్: క్రిస్టియన్‌పాలెంలోని అంబేద్కర్ మున్సిపల్ యూపి స్కూల్‌ను ఎంఈఓ ఎస్. నాగేశ్వరరావు మంగళవారం సందర్శించారు. విద్యార్థులల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బంగారుతల్లి కార్డులను ఆయన పరిశీలించారు. పాఠ్యాంశాల్లోని అంశాలపై విద్యార్థులను ప్రశ్నలు సమాధానలు రాబట్టారు. ఇంగ్లిష్‌లో విద్యార్థులు వెనుకబడి ఉండటాన్ని గుర్తించారు. మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్ట్‌ల్లో విద్యార్థుల సామర్థ్యాల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు ఎంఈఓ సూచించారు.

సొరియాసిస్ పేషెంట్లకు ఉచిత వైద్యసేవలు

నరసరావుపేట: ప్రపంచ సొరియాసిస్‌డేను పురస్కరించుకొని గుంటూరురోడ్డులోని కేరళ ఆయుర్వేద హాస్పిటల్‌లో గత మూడురోజుల నుంచి నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరంలో 209 మందికి వైద్యసేవలు అందజేసినట్లు డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ పరీక్షలు చేసి ఆయుర్వేద మందులను ఉచితంగా ఉందజేశామన్నారు. సోరియాసిస్‌పై వచ్చిన వారందరికీ అవగాహన కల్పించామన్నారు.

డీఎస్‌పీ స్టేడియంలో జగనన్న సురక్ష వైద్యశిబిరం

342 మందికి వైద్యసేవలు



నరసరావుపేటలో ఓపీ కౌంటర్ వద్ద పేర్లు నమోదుచేసుకునేందుకు వేచిచేస్తున్న జనం

నరసరావుపేట: సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్‌పీ స్టేడియం ఆవరణలో మంగళవారం నిర్వహించిన 33వ వార్డు బరంపేటకు చెందిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిభిరంలో 342 మందికి వైద్యసేవలు అందజేశారు. శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ సందర్శించి వైద్యులు, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. డాక్టర్ జి.హర్షవర్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో జనరల్ మెడిసన్ వైద్యులు ప్రశాంతి, జనరల్ సర్జన్ వైద్యులు వెంకటేశ్వరరావు, ప్రాథమిక వైద్యశాల డాక్టర్లు ప్రియాంక, త్రివేణి, ఆషాలతలు రోగులను పరీక్షించి మందులు రాశారు. వైద్య సిబ్బంది ఓపీ నమోదుచేసుకొని బీపీ పరీక్ష, రక్తపరీక్షలు చేశారు. ప్రతి ఒక్కరికీ వారికున్న జబ్బును బట్టి రూ.400లు నుంచి రూ.1500లు విలువచేసే మందులను ఉచితంగా అందజేశారు. ఎంవీరెడ్డి కంటి వైద్య సిబ్బంది రోగులకు కళ్లపరీక్షలు చేశారు. ఐసీడీఎస్ అంగన్వాడీ కార్యకర్తలు పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేసి రోగులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సహాయ సహకారాలు అందజేశారు.

బొల్లాపల్లి మండలంలో...

బొల్లాపల్లి: జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా మండలంలోని గరికపాడు సచివాలయంలో నిర్వహించిన వైద్య శిబిరంతో ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సచివాలయం పరిధిలో గరికపాడు, పమిడిపాడు గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో వచ్చిన రోగులకు వైద్యులు, వైద్య సిబ్బంది సేవలు అందజేశారు. ఆయా గ్రామాల నుంచి 640 మంది వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వీరిలో 159 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మరో 12 మందిని వివిధ రోగాలకు సంబంధించి ఆరోగ్యశ్రీ ద్వారా దీర్ఘకాలిక వ్యాధులకు కార్పొరేట్ స్థాయి వైద్యశాలలకు రిఫర్ చేసినట్లు బొల్లాపల్లి వైద్యాధికారి పి. శంకర్‌నారాయణ ఈ మేరకు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పి. కృష్ణానాయక్,బి. దుర్గారావులు, ప్రత్యేక వైద్య నిపుణులు, బి. రాంబాబు, కెఎల్ఎస్‌రావు, షేక్ జానీహీరాలు రోగులకు వైద్య చికిత్సలు అందజేశారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ బత్తిరాములు, సర్పంచ్‌లు ఎం. కొండలు, కె.బాలిరెడ్డిలు సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షతో పట్టణాలకు వెళ్ళలేని పేదలకు మెరుగైన వైద్య సేవలు అందాయని అన్నారు. ముఖ్యమంత్రి పలు పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అండగా ఉన్నారని, ఆరోగ్య సురక్ష గ్రామాల్లో భరోసా ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో జి.శ్రీహరి, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు సేవలు అందజేశారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: ప్రతి కుటుంబానికి వైద్యసేవల్ని ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. పట్టణంలోని ఆదిఆంధ్ర కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆయన సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో 32వ వార్డు కౌన్సిలర్ బిట్రా రాజేంద్రప్రసాద్, సొసైటీ మాజీ అధ్యక్షుడు తోట బ్రహ్మస్వాములు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాం

మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



చిలకలూరిపేట: టిడ్కో గృహసముదాయంలో అన్ని వసతి సౌకర్యాలు కల్పించామని... ఇంకా పలు సౌకర్యాలను కల్పిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని చెప్పారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో మంగళవారం నిర్వహించారు. సమావేశానికి చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. టిడ్కో గృహసముదాయంలో జంగిల్ క్లీనింగ్ పనులను ప్రతిపాదిస్తూ టేబిల్ అజెండాగా చేర్చిన విషయంలో విపక్ష టీడీపీ కౌన్సిలర్లు విమర్శలకు దిగారు. టిడ్కో గృహసముదాయంలో వసతులు కల్పించలేదని, అందుకే లబ్ధిదారులు గృహాల్లో చేరడం లేదని విమర్శించారు. దీనిని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు కల్పించుకుంటూ టిడ్కో గృహాల నిర్మాణంతో పాటు సౌకర్యాలను కల్పించడం జరిగిందని చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యుల ద్వారా ప్లాట్ల కేటాయింపు జరిగిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పటికే మేడలు, మిద్దెలు ఉన్న వారికే జన్మభూమి కమిటీల సభ్యులు ప్లాట్లు కట్టబెట్టడం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లు ఉన్న వారికే తిరిగి ఇళ్లు ఇచ్చిన కారణంగానే టిడ్కో గృహాల్లో చేరడం లేదని సిగ్గులేకుండా సౌకర్యాలకు కల్పించలేదంటూ విమర్శలకు దిగుతారా అంటూ మండి పడ్డారు. చైర్మన్ షేక్ రఫాని కల్పించుకుని ఇప్పటికే 3 వేల మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు పూర్తిచేసి ప్లాట్లు స్వాధీన పరిచినట్లు చెప్పారు. అజెండాలలోని అంశాలను అంగీకరిస్తున్నట్లు తెలిపి చైర్మన్ సమావేశాన్ని ముగించారు.

చెకుముకి పోటీల పోస్టర్ల ఆవిష్కరణ

వినుకొండ టౌన్: చెకుముకి సైన్స్ సంబరాలలో భాగంగా ప్రతిభా పరీక్షలను 2023 నవంబర్ 10న నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు అప్పరాజు నాగేశ్వరరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్ఎస్‌పీ జిల్లా పరిషత్ పాఠశాల నందు చెకుముకి సైన్స్ సంబరాల గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం జనవిజ్ఞాన వేదిక వినుకొండ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గడిచిన 30 సంవత్సరాలుగా 8, 9, 10 విద్యార్థులకు చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొనే విధంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రోత్సహిస్తూ, ఎంత మంది విద్యార్థులు హాజరవుతారో తెలియచేయాలన్నారు. పాల్గొనే విద్యార్థుల వివరాలను నవంబర్ 5వ తారీకు లోపు అందచేయాలని పట్టణ జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు కమలారామ్ కోరారు. కార్యక్రమంలో సభ్యులు రవికుమార్, యూత్ కార్యదర్శి రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు గోవింద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు సామర్థ్య పరీక్ష పత్రాలు



యడ్లపాడు మండలానికి చేరిన పరీక్ష పత్రాలతో ఎంఈవోలు నాగరత్నం, అరుణకుమారి

యడ్లపాడు: స్టేట్ ఎడ్యుకేషన్ అకడమిక్ సర్వే (సీజ్) ప్రశ్నా పత్రాలు మండలానికి వచ్చినట్లు ఎంఈవోలు నాగరత్నం, అరుణకుమారి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ జాతీయ విద్యాసాధన సర్వేలో భాగంగా తెలుగు, ఆంగ్లం, గణితంలో విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించేందుకు ఈనెల 3వ తేదీన పరీక్ష నిర్వహించనున్నారు. విద్యాశాఖ ఆధ్వర్యాన మండలంలోని 20 పాఠశాలల్లో 3, 6, 9వ తరగతి చదివే 529 మంది విద్యార్థులకు ఈ పరీక్షలను రాయనున్నారు. ఇప్పటికే పరీక్ష నిర్వహణకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా బీఈడీ, ఇంజినీరింగ్ విద్యార్థులను 45 మందికి ఎంపిక చేసినట్లు వెల్లడించారు. వీరితో పాటు ఆయా పాఠశాలల హెచ్ఎంలకు ఈనెల 26, 27వ తేదీల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తున్న ఈ పరీక్షలకు సంబంధించిన పత్రాలు మండలానికి వచ్చాయన్నారు. వీటిని ఈనెల రెండోతేదీన స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలకు అప్పగిస్తామని, పరీక్ష రోజున అక్కడి నుంచి ఇన్విస్టిగేటర్లు తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

సర్వే పరీక్షలకు రంగం సిద్ధం

శావల్యాపురం: విద్యార్థుల్లో సామర్థాల సర్వే పరీక్షలకు రంగం సిద్ధం చేశామని మండల విద్యాశాఖాధికారి పుసులూరి లలితాకుమారి అన్నారు. మంగళవారం స్థానిక మండల వనరుల కేంద్రంలో ఇన్వీజిలేటర్లుకు పరీక్షల నిర్వాహణపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రభుత్వ ప్రవేటు పాఠశాలల్లో విద్యను అభ్యశిస్తున్న 3,6,9 తరగతులకు చెందిన విద్యార్థుల్లో సామర్థ్యాలను వెలికి తీయటానికి ఈపరీక్షలు దోహదపడతాయన్నారు. మండలంలోని 17 పాఠశాలలు సర్వే పరీక్షల కోసం ఎంపిక చేశామని ఇందులో 3వ తరగతి విద్యార్థులు-230 ఉండగా పరీక్ష సమయం 60 నిమిషాలు, 6వ తరగతి విద్యార్థులు 213 ఉండగా పరీక్ష సమయం 75 నిమిషాలు, 9వ తరగతి విద్యార్థులు -131 మంది ఉండగా పరీక్ష సమయం 90 నిమిషాలు కేటాయించినట్లు చెప్పారు. 30 మంది ఇన్వీజిలేటర్లు పర్యవేక్షణలో పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఇన్వీజిలేటర్లు శిక్షణా అనంతరం పరీక్షల నిర్వహణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలు చేశామన్నారు.

మాలమహానాడు శ్రేణుల ర్యాలీ



నరసరావుపేట: మాలలకు ప్రాధాన్యత ఇవ్వని రాజకీయ పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు గోళ్ళ అరుణ్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట ప్రకాష్ నగర్‌లోని షాదిఖానాలో రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్‌పాల్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా మాలల ఆత్మీయ సమావేశంకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు జాన్‌పాల్, నియోజకవర్గం యూత్ అధ్యక్షులు సేవా సామియేలు, జిల్లా ఉపాధ్యక్షులు కోండ్రు విజయ్ నిర్వహించారు. రాష్ట్ర మహిళా నాయకురాలు పిల్లి మేరీ, ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు దారా హేమా ప్రసాద్, నరసరావుపేట, వినుకొండ, చిలకలూరిపేట, సత్తెనపల్లి, మాచర్ల, గురజాల, పెదకూరపాడు నియోజకవర్గాల అధ్యక్షులు వుస్తేల జయరావు, కీర్తిపాటి వెంకటేశ్వర్లు, సురేష్, గుంటూరు ఆశీర్వాదం, చంద్రయ్య, వాసు, చంద్ర నరసింహారావు, వివిధ మండలాల గ్రామ స్థాయి నాయకులు ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలి



మేళ్ళవాగు గ్రామ ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

బొల్లాపల్లి: రక్తహీనత నివారణకు పోషకాహారం తీసుకోవాలని జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం వై.రామ కోటేశ్వర రావు తెలిపారు. మండలంలోని మేళ్ళవాగు గ్రామ జెడ్పీ హైస్కూల్‌లో బంగారుతల్లి కార్యక్రమం జాతీయ సమైక్యత దివస్ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులతో ర్యాలీ నిర్వహించారు. పాఠశాలలకు గైర్హాజరవుతున్న విద్యార్థులకు సంబంధించి ఇంటింటికీ వెళ్లి వారిని పాఠశాలకు హాజరు కావాలని పిలుపునిచ్చారు. వీరిలో 15 మంది విద్యార్థులు పిలుపుతో హాజరయ్యారు. బాలికలు పోషకాహార లోపం లేకుండా జాగ్రత్తలు వహించాలని, పుష్టికరమైన ఆహార పదార్థాలు భుజించాలన్నారు. బాలికలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినాన్ని పురస్కరించుకుని దేశ సమైక్యతను చాటే విధంగా గ్రామంలో ప్రధాన కూడళ్లల్లో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ప్రజలందరూ ఐక్యమత్యంగా ఉండాలని, సమైక్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధించగలమని హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పెద్దలు పాల్గొన్నారు.

పుస్తకాలు ఎంతో విలువైనవి

నరసరావుపేట: బంగారం, మణులు, మాణిక్యాలు, వజ్రాల కన్నా విలువైనవి పుస్తకాలని, టీవీలు, సెల్ ఫోన్లు చూడటం తగ్గించి పుస్తక పఠనం పెంచుకొని వ్యక్తిత్వాలను తీర్చిదిద్దుకోవాలని సాహితీవేత్తలు, గాంధీ స్మారక సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఈదర గోపీచంద్, శ్రీనాథ సాహితీ పరిషత్ ప్రధాన కార్యదర్శి స్వర్ణ చిన్నరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆర్డీవో ఆఫీస్ సెంటర్ లోని మోర్ సెల్లార్ లో ఏర్పాటు అయిన విశాలాంధ్ర ప్రచురణాలయ పుస్తక ప్రదర్శనను మంగళవారం సందర్శించారు. ఎన్నో రకాల వందలాది పుస్తకాలు పట్టణానికి ఇంత పెద్ద ఎత్తున తెప్పించి ప్రదర్శన, విక్రయం ఏర్పాటు చేసిన ప్రచురణకర్తలను అభినందించారు.

ఉక్కుమనిషికి ఘన నివాళులు

నాదెండ్ల: సువిశాల స్వతంత్ర్య భారతావనిలో వందలాది సంస్థానాలను విలీనం చేసి ఉక్కుమనిషిగా ఖ్యాతిగాంచిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ చెప్పారు. నాదెండ్ల మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన జయంతి వేడుకలు నిర్వహించారు.

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి వేడకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ సర్దార్ వల్లబాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు.

అట్లతద్ది వేడుకలు

రొంపిచర్ల: మండలంలో మంగళవారం అట్లతద్ది వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. దసరా పండుగ వెళ్లిన తర్వాత వచ్చే ఆశ్వయుజ బహుళ తదియ నాడు ఈ పండుగను జరుపుకుంటారు. ఐదు ఏళ్ల పైబడిన పెళ్లి కాని, పెళ్లి అయిన మహిళలు ఈ అట్లతద్ది పండగను నిర్వహించుకున్నారు. ఉదయం నుంచే ఉపవాసాలతో ఈ పండుగ ప్రారంభమయ్యింది.

గడప గడపకు 'జగనన్న' సంక్షేమం చేరింది

- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు
- వినుకొండలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): అర్హులైన ప్రతిఒక్కరికీ ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. వినుకొండ పట్టణంలోని హనుమాన్‌నగర్ -1 సచివాలయం పరిధిలోని 28వ వార్డు నందు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు.

అనంతరం వార్డు ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి సహాయ సహకారాలతో వినుకొండ నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశామన్నారు. ఒక వైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి అనే నినాదంతో మారుమూల పల్లెల్లో సైతం సంక్షేమ పథకాలు అందించామన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, అంగన్వాడీ కేంద్రాలు అభివృద్ధి చేశామన్నారు. పాఠశాలల్లోని ఇంగ్లిష్ మీడియంతో పాటు విద్యార్థులకు అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో పథకాలను అందించామన్నారు.

అలాగే సంక్షేమ పథకాల రూపంలో రూ.2.37 లక్షల కోట్లు ప్రజల ఖాతాల్లో జమ చేశా మన్నారు. అదే స్ఫూర్తితో వినుకొండ నియోజకవర్గాన్ని, వినుకొండ పట్టణాన్ని అన్ని విధా లుగా అభివృద్ధి చేశామన్నారు. ఇంటింటికీ తిరుగుతున్నప్పుడు ప్రజలు తమకు ప్రభుత్వం అందించిన పథకాలు తెలియజేస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. వినుకొండ అభివృద్ధి గత ప్రభుత్వంతో పోల్చి చూసుకోవాలని అన్నారు. గత పదేళ్లలో వినుకొండ వెనుకబడిన ప్రాంతంగానే ఉందని, కనీసం తాగునీరు అందించలేని స్థితిలో మున్సిపాలిటీ ఉందని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వినుకొండకు శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత మున్సిపల్ కాంప్లెక్స్‌లు, ఎన్ఎస్‌పీ కెనాల్‌పై సీసీ రోడ్లు, ఘాట్‌రోడ్డు నిర్మాణం, గిరిప్రదక్షిణం రోడ్డుతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు.

కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పీఎస్ ఖాన్, వార్డు కౌన్సిలర్ బత్తుల పద్మ, వైస్ చైర్మన్‌లు తెల్లాకుల రాజేష్‌ఖన్నా, బేతం గాబ్రియేలు, కౌన్సిలర్లు షకీలా దస్తగిరి, ఎంఎస్‌కే బాషా, గంటా కాలేషా, నంది నరసింహారావు, పాప సాని బ్రహ్మయ్య, ఎం.ఎల్.రెడ్డి, కల్యాణ్, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, జెడ్పీ కోఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్, సొసైటీ చైర్మన్ అనుమోలు నాసరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.